## కాలుష్య సమస్యను పరిష్కరించండి

జిన్నారం, జూలై 5: ఖాజీపల్లి గ్రామంలో కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు ఎంపీ రఘునందన్ రావును కోరారు. శుక్రవారం ఖాజీపల్లి జేఏసీ నాయకులు బీజేపీ జిన్నారం మండల నాయకులతో కలిసి ఎంపీని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని, కాలుష్య సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ప్రముఖ న్యాయవాది, పర్యావరణవేత్త దండే రమాకాంత్ తెలిపారు. బీజేపీ నాయకులు నర్సింగ్‌రావు, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## 8న కంటి వైద్య శిబిరం

సదాశివపేట, జూలై 5: ఈ నెల 8న ఉచితంగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బోడపల్లి శంకరప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ హైదరాబాద్ మెడివిజన్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తారన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ అ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పండరి, కోశాధికారి జనార్దన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## నోట్ బుక్కులు పంపిణీ

సదాశివపేట, జూలై 5: పట్టణంలోని సిద్దాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సమత బెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా నోట్ బుక్కులను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అనంతయ్య, కౌన్సిలర్ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ సూర్యప్రకాశ్, రిటైర్డ్ ఎంఈవో అంజయ్య, ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, సుదర్శనం, సీఆర్పీలు రాజేశ్వర్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠరథం అందజేత

హత్నూర, జూలై 5: హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఏవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ శరత్‌చంద్ర శుక్రవారం వైకుంఠరథం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల సమయంలో వైకుంఠరథం గ్రామానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి యాదగిరి, గ్రామస్తులు బోగయ్య, సత్యనారాయణగౌడ్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం


మాల విఠల్

రాయికోడ్, జూలై 5: నాలుగు రోజులుగా ఓ వ్యక్తి ఆచూకీ లేదని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని శంశోద్దీన్‌పూర్‌కు చెందిన మాల విఠల్(53) గురువారం రాత్రి భోజనం చేసి పడుకోవడానికి ఇంటిపైకి వెళ్లిన వ్యక్తి కనబడకపోవడంతో చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం విఠల్ కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విఠల్ ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు తెల్లని అంగి, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు.

## బీజేవైఎం నాయకుల ఆందోళన

చౌటకూర్, జూలై 5: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హిందువుల పట్ల అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామం వద్ద సంగారెడ్డి-నాందేడ్, అకోలా 161వ జాతీయ రహదారిపై బీజేవైఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు బైటాయించి, ధర్నా చేపట్టారు. రాహుల్‌గాంధీ డౌన్‌డౌన్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీరుడు ప్రవీణ్‌కుమార్‌ముదిరాజ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు మర్రి మహేశ్, ఉపాధ్యక్షుడు మిరియాల రాకేశ్, నాయకులు నిజాంపురం సాయికృష్ణ, కుమ్మరి ఆంజనేయులు, గాండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

న్యాల్‌కల్, జూలై 5: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కార్మిక విభాగం డిప్యూటీ కమిషనర్, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలను చేపట్టారు. అనంతరం ఎంపీపీ సమావేశ మందిరంలో మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారి సురేశ్, మండల ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి రంగారావు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

- ఇబ్బందుల్లో సిబ్బంది విధులు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- వర్షాలకు తడిసిపోతున్న మందులు



మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో పశువైద్య కేంద్రం భవనం దుస్థితి

న్యాల్‌కల్, జూలై 5: మూగజీవులకు వైద్యం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పశువైద్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. మండల కేంద్రమైన న్యాల్‌కల్, చాల్కి గ్రామాల్లోని పశువైద్యకేంద్రాలతోపాటు హద్నూర్, మెటల్‌కుంట, డప్పూర్ గ్రామాల్లోని పశువైద్య ఉప కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వైద్యాధికారులు, సిబ్బంది భయపడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలోని పశువులకు వైద్య సేవలను అందిస్తున్నారు.

**వర్షం పడితే అంతే సంగతులు!**

మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామంలోని పశువైద్య కేంద్ర భవనంలో చిన్నపాటి వర్షాలకు పైకప్పు నుంచి నీరు గదుల్లోకి చేరుతున్నది. పశువైద్యశాలలో ఉన్న విలువైన మందులు, రికార్డులు తడిసి ముద్దవుతున్నాయి. పశువైద్యశాల ప్రహరీ కూలిపోవడంతో వర్షం పడితే చాలు నీటితో నిండిపోతుంది. పశువైద్య కేంద్రం ముందున్న రోడ్డు ఎత్తు పెరిగిపోవడంతో భవనం పరిసరాలు గుంతలో ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ భవనానికి పలుసార్లు మరమ్మతులు చేసినా శిథిలావస్థకు చేరిన భవనం పైకప్పు పెచ్చులు ఉడడంతోపాటు వర్షాలు పడితే వరద నీరంతా పశువైద్యశాల పరిసరాల్లో నిండిపోతున్నది. వర్షం పడితే వైద్యాధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

**విధులకు అటంకం**

మండలంలోని చాల్కి, హద్నూర్, డప్పూర్ గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షాలు పడితే భవనంలోని మందులు, రికార్డులు పూర్తిగా తడిసిపోతున్నాయి. దీనికితోడు విధులు నిర్వహిస్తున్నడు పైకప్పు పెచ్చులూడిపోతున్నదని వైద్యాధికారులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు ఉచిత మందులు, టీకాలు వేసేటప్పుడు వాటిని భద్రపరిచేందుకు నానా అవస్థలు పడుతున్నట్టు చెపుతున్నారు. శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్రాల దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారు కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి కొత్త భవనాలను నిర్మించాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.


వర్షానికి వరద నీటితో నిండిపోయిన పశువైద్య కేంద్రం పరిసరాలు


పెచ్చులూడుతున్న పైకప్పు

## దొంగల భయం.. జనం జాగారం

హత్నూర, జూలై 5: హత్నూర మండలం పన్యాల, బడంపేట గ్రామాల ప్రజలు నాలుగు రోజులుగా భయం గుప్పిట్లో గడుపుతున్నారు. నాలుగు రోజులక్రితం దుండగులు పన్యాల గ్రామంలో మూడు ఇండ్లలో చోరీ చేసి, మరో నాలుగు ఇండ్లలో చోరీకి యత్నించి పారిపోయారు. మరుసటి రోజు నుంచి నల్ల దుస్తులు ధరించి మారణాయుధాలతో రాత్రి సమయంలో సంచరిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు భయంభయంగా గడుపుతున్నారు. రెండు రోజులుగా రాత్రి సమయంలో రెండుగ్రామాల్లో ప్రజలు రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గస్తీ కాస్తున్నారు. గ్రామంలో చాటింపు వేయించారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నప్పటికీ దుండగులు సంచరిస్తున్నట్లు అనుమానం ఉందని నిఘాను పెంచాలని కోరుతున్నారు. ఈవిషయమై హత్నూర ఎస్‌ఐ సుభాష్‌ను సంప్రదించగా చోరీ జరిగిన రోజు నుంచి గ్రామంలో పెట్రోలింగ్ వాహనం తిరుగుతున్నదని, ఎవరూ భయాందోళనకు గురికావద్దని సూచించారు.

## మురుగు కాల్వల పరిశీలన


కోహీర్‌లో మురుగుకాల్వలను పరిశీలిస్తున్న ఎంపీవో రఘు

కోహీర్, జూలై 5: కోహీర్ పట్టణంలోని పలు కాలనీల్లోని డ్రైనేజీలు, సీసీ రోడ్లను మండల పంచాయతీ అధికారి రఘు శుక్రవారం పరిశీలించారు. తమ కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని జిల్లా ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మురుగు నీటితో కాల్వలు నిండిపోవడం, సీసీ రోడ్లు బురదమయం కావడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎంపీవోను ఆదేశించారు. ఆయన కాలనీల్లో పర్యటించి వివరాలను సేకరించారు. ఆయన వెంట కార్యదర్శి మిస్కీన్ ఉన్నారు.

## బొల్లారంలో గుట్కా పట్టివేత

బొల్లారం, జూలై 5: బొల్లారంలోని జ్యోతినగర్‌లో శుక్రవారం పోలీసులు కృష్ణదత్తు, దీనబంధు దత్తు అనే వ్యక్తులకు సంబంధించిన కిరాణం షాపుల్లో గుట్కా అమ్ముతున్నట్టుగా గుర్తించి దాడులు చేశారు. రూ.69వేల విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. గుట్కా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్‌ఐ దశరథ్ తెలిపారు. గుట్కా అమ్మితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

## క్రషర్ ఆవరణలో గంజాయి మొక్కలు ధ్వంసం


హంగిర్గ(బి)లో గంజాయి మొక్కలను చూపుతున్న ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్, జూలై 5: కంకర క్రషర్ ఆవరణలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను గుర్తించి బాధ్యులైన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు నారాయణఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. నారాయణఖేడ్ మండలం హంగిర్గ(బి) శివారులోని దుర్గాభవాని క్రషర్ వద్ద గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు అందిన సమాచారం మేరకు క్రషర్ చుట్టపక్కల తనిఖీలు చేపట్టగా 16 గంజాయి మొక్కలను గుర్తించినట్లు తెలిపారు. క్రషర్‌లో పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన నవీన్‌కుమార్, సంతోష్‌కుమార్ పారిపోయేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని విచారించగా తాము సేవించేందుకు ఉత్తరప్రదేశ్ నుంచి తెచ్చుకున్న గంజాయిలో లభించిన విత్తనాలను ఇక్కడ చల్లడంతో మొలకెత్తిన మొక్కలను సేవించడం కోసం పెంచుతున్నామని అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

## సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి


సెల్ టవర్‌ను నిలిపివేయాలని సీఐకి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సదాశివపేట, జూలై 5: ప్రజారోగ్యం దెబ్బతీసే సెల్ టవర్ నిర్మాణ పనులను వెంట నే నిలిపివేయాలని పట్టణంలోని 14వ వార్డు ప్రజలు కోరారు. శుక్రవారం మున్సిపల్ మేనేజర్ ఉపేందర్‌సింగ్, సీఐ మహేశ్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ వార్డులో సెల్ టవర్ ఏర్పాటుతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, స్వార్థ ప్రయోజనాల కోసమే నాలుగు అంతస్థుల బిల్డింగ్‌పై సెల్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు ప్రదీప్‌జైన్, శివకుమార్, సాగర్‌సేట్, సంగన్న, రమేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రషర్లను శాశ్వతంగా మూసేయాలి

**కలెక్టర్‌ను కోరిన మాదారం గ్రామస్తులు**


కలెక్టర్ క్రాంతి వల్లూరుకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

జిన్నారం, జూలై 5: మాదారం గ్రామ పరిధిలోని కంకర క్రషర్లను శాశ్వతంగా మూసేయాలని గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. గ్రామ నాయకుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ క్రాంతి వల్లూరుని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామ పరిధిలో ఉన్న కంకర క్రషర్లు, క్వారీ పేలుళ్లతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, వెంటనే వాటిని మూసేయాలని గ్రామస్తులు కోరారు. కొత్త వాటికి అనుమతులు ఇవ్వకుండా ఉన్న వాటిని మూసేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో క్రషర్లను సందర్శించి విచారణ జరుపుతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. సీతారాంసింగ్, సీతారామ్‌యాదవ్, ఆది ఎల్లయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## విధుల్లోకి తీసుకోవాలంటూ ఆందోళన


ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

హత్నూర, జూలై 5: పాత కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ మండలంలోని చందాపూర్ ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ ఎదుట శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. నెల క్రితం పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మృతి చెందడంతోపాటు పలువురు కార్మికులకు తీవ్ర గాయాలుకాగా పరిశ్రమ పూర్తిగా ధ్వంసమై ఉత్పత్తులు నిలిచిపోయాయి. ఇటీవల పరిశ్రమలో మరమ్మతులు చేసి ఉత్పత్తి చేపట్టిందని, గాయపడ్డ కార్మికులను యాజమాన్యం పక్కనపెట్టి కొత్తగా కార్మికులతో ఉత్పత్తులు చేపడుతున్నట్లు ఆరోపించారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలతో బయటపడిన తమను విధుల్లోకి తీసుకోకుండా కొత్తవారిని తీసుకోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా పరిశ్రమ యాజమాన్యం పాత కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మికులు చేపట్టిన ఆందోళనకు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.



న్యాల్‌కల్: పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మారుతీయాదవ్

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలి**

న్యాల్‌కల్, జూలై 5: ప్రభుత్వం అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల ఉద్యమాన్ని ఆపలేదని బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మారుతీయాదవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ మేరకు ఉద్యోగాల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరుద్యోగ టీజీఎస్‌పీఎస్సీ కార్యాలయ ముట్టడికి మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు మారుతీయాదవ్ స్వగ్రామమైన మల్గిలో గురువారం రాత్రి హద్నూర్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉద్యోగుల భర్తీ కోసం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగులకు మద్దతు పలికేందుకు వెళ్తుంటే అక్రమంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిరుద్యోగులకు ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**హామీల అమలులో కాంగ్రెస్ విఫలం**

కోహీర్, జూలై 5: ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు రాకేశ్ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి బయలుదేరుతుండగా పలు సంఘాల నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు, రూ.4వేల నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారని, ఇంతవరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. అక్రమ అరెస్టులు నిరుద్యోగుల ఉద్యమాలను ఆపలేవని హెచ్చరించారు.


కోహీర్: నాయకులను అరెస్టు చేసి చిరాగ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు


కోహీర్: జహీరాబాద్ పీడీఎస్‌యూ నియకులను అరెస్ట్ చేసిన పోలీసులు

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


జోగిపేట దవాఖానలో వైద్య సిబ్బంది, రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌వో సంగారెడ్డి

**డీసీహెచ్‌వో సంగారెడ్డి**

అందోల్, జూలై 5: దవాఖానకు వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ప్రభుత్వ దవాఖానల సమన్వయ కర్త(డీసీహెచ్‌వో) సంగారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జోగిపేట ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేసి రోగులు, వారి బంధువులతో మాట్లాడారు. దవాఖానాలో పారిశుధ్య పనులు, ఇతర సౌకర్యాలు పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురువారం నమస్తేతెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టేందుకు వచ్చినట్లు తెలిపారు. గురువారమే విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న స్టాఫ్‌నర్సుతోపాటు శానిటేషన్ కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేశారు. శుక్రవారం జరిపిన విచారణలో మరో ఇద్దరు సిబ్బందికి మెమోలు జారీ చేసినట్లు వెల్లడించారు. పూర్తి విచారణ వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలుంటాయన్నారు. జోగిపేట దవాఖానలో వసతులు కల్పించేందుకు వైద్యారోగ్య శాఖ మంత్రి రూ.2 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. అందోల్ -జోగిపేటలో నర్సింగ్ కళాశాలతోపాటు మాతా శిశు దవాఖానను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, వైద్యులు శంకర్‌బాబు సిబ్బంది ఉన్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో రుద్రహోమం


వీరభద్రస్వామి ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

గుమ్మడిదల, జూలై 5: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీసమేత వీరభద్రస్వామి ఆలయంలో భక్తులు వైభవంగా రుద్ర హోమం నిర్వహించారు. శుక్రవారం అమావాస్యను పురస్కరించుకొని వీరభద్రస్వామి ఆలయంలో ఈవో శశిధర్‌గుప్తా పర్యవేక్షణలో జూనియర్ అసిస్టెంట్ సోమయ్య ఆధ్వర్యంలో వేదపండితులు రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతితో హోమాన్ని ముగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. నంతరం వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు నరేశ్, చందు పాల్గొన్నారు.


ఝరాసంగం: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులతో ప్రధానోపాధ్యాయుడు

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం


హత్నూర: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్

ఝరాసంగం, జూలై 5 : ఉపాధ్యాయులకు బదిలీలు సహజమని, వారు నిర్వర్తించిన విధులు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎల్గోయి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలం ఎల్గోయి ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. మాజీ ఎంపీటీసీ సునీతగుండప్ప 13 ఏండ్లుగా గ్రామ విద్యార్థులకు బోధన అందించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు మాజీ ఎంపీటీసీ పూలమాల, శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బుచ్చయ్య, ఉపాధ్యాయులు శోభారాణి, తుక్కప్ప, రవికుమార్, సాయిలు, మాధవి, శ్యామయ్య, తుకారం, పాండు, హనుమంతు, అపర్ణ, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**హత్నూరలో..**

హత్నూర, జూలై 5: మండల కేంద్రమైన హత్నూర ప్రభుత్వ పాఠశాలలో ఏండ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం మాజీ సర్పంచ్ వీరస్వామిగౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది ఉపాధ్యాయులేనన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, అలాంటి వృత్తిపట్ల ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో ఉండి ఎక్కడ విధులు నిర్వహించినా మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమాజసేవకుడు అజయ్ మారుతీరావు,వెంకటేశంగౌడ్, యాదగిరి, శంకర్ పాల్గొన్నారు.

## కేతకిలో ఆషాఢ అమావాస్య పూజలు


ఝరాసంగం: స్వామి వారి దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

ఝరాసంగం, జూలై 5: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆషాఢ అమావాస్య సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. స్వామి వారి దర్శనం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు ఆలయ ఆవరణలోని అమృతగుండంలో స్నానాలు ఆచరించి జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీసమేత సంగమేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయంలో అన్నదానం చేఉశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని కుప్పానగర్ గుబ్బడి సంగమేశ్వర ఆలయం, పొట్టిపల్లి సిద్ధేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**వీరభద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు**


రాయికోడ్ వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

రాయికోడ్, జూలై 5: అమావాస్యను పురస్కరించుకొని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. ఆషాడం అమవాస్య సందర్భంగా గ్రామాల్లోని గ్రామ దేవతుల ఆలయ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యాక్రమంలో పూజారులు వీరేశంస్వామి, రుద్రయ్యస్వామి, బస్వరాజుస్వామి, శివకుమార్‌స్వామి, రాఘునాథ్, శివకుమార్ ఉన్నారు.